**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

కష్టకాలమందు కరుణతో కాపాడు
వారికెపుడు నీవు దూరమవకు
చెప్పెడు పలుకు విని చెడగొట్టుకోకుము
బంధములను కాచు భద్రముగను
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 31 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | జూలై 30, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

**- కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం**



**న్యూఢిల్లీ,జూలై 29 :**ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను మిగతా2లో...

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**● వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం ● విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం ● పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదన్న జితేంద్ర సింగ్ ● బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా**



**న్యూఢిల్లీ,జూలై 29 :** వాడీవేడీ చర్చలు.. విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన మిగతా2లో...

## గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

**ఉత్పాదక సామరథ్యం మెరుగు పర్చాలి**

**చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు**



2లో

## పులుల సంరక్షణ మన బాధ్యత

**- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది**

**- అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ**



**హైదరాబాద్,జూలై 29 :** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు

మిగతా2లో...



## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

- **వారి హయాంలోనే కట్టడం..కూలడం చూశాం**
- **దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు**
- **ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,జూలై 29 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో మిగతా2లో...

## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

**పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు**

**మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల**



2లో

## టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

**- నకిలీ వెబ్‌సైట్ గుర్తించిన టిటిడి అధికారులు**





**తిరుమల,జూలై 29 :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పేరుతో సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా ఫేక్ వెబ్‌సైట్ రూపొందించి, భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు

మిగతా2లో...

## చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ



**అమరావతి,జూలై 29 :** ఏపీ సీఎం చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో తైవాన్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, షెంగ్ హుయ్ టెక్ తదితర

మిగతా2లో...



## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

- **పర్యావరణ అనుముతులు చెల్లుబాటు**
- **సుప్రీంకోర్టులో ఉపశమనం**

**న్యూఢిల్లీ,జూలై 29 :**తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర మిగతా2లో...

## ఎల్‌నినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

**● బంగాళాఖాతంలో మునిగిపోయిన వారు చేసే వ్యాఖ్యలు ● హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల కౌంటర్**



**హైదరాబాద్,జూలై 29 :** హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపో యిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. మిగతా2లో...

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.

# కాళేశ్వరంపై కేటీఆర్ మాటలు సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నా మని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహాబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఎ÷-లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాఫర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

హైదరాబాద్,జూలై 29 :రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. ఓ పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరిచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.సమావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# పులుల సంరక్షణ మన బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)



సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిఐఎస్ఎఫ్ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రా బాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్ష ణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్ర మాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రా ణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని మంత్రి సురేఖ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్స వం సందర్భం గా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి 'అటవీ సం పదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజా యి తీ, సేవా భావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెల ంగా ణను అందించాలి' అని మంత్రి దిశా నిర్దేశం చేశారు.

# చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఎయిర్‌పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్ తదితర అంశాలను తైవాన్ బృందానికి సీఎం వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మ్యానుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వారికి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తిస్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# తెలంగాణ నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

హైదరాబాద్,జూలై 29 : తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ÷ర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

(మొదటి పేజీ తరువాయి)

నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ÷రావేశీ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్టానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# ఎలనినోతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# టిటిడి పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ ఫేక్ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసేందుకు ప్రయత్నించే భక్తుల నుంచి వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఆన్‌లైన్ చెల్లింపులు సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా డిజైన్ చేయడంతో చాలామంది భక్తులు ఇది అసలైన వెబ్‌సైట్‌గా భావించి మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్ల విషయంలో ఇప్పటికే పలుమార్లు టీటీడీ భక్తులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. వేంకటేశ్వరస్వామి దర్శనం, అర్జిత సేవలు, వసతి, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు వంటి అన్ని బుకింగ్‌లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, తెలియని లింకులు, అనధికార వెబ్‌సైట్లను నమ్మొద్దని టీటీడీ అధికారులు సూచించారు. వెబ్‌సైట్ అడ్రస్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా లింకులు కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారులకు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భక్తులు అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ మోసాల నుంచి బయటపడవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

RNI - TELTEL/2023/87644

## చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యం



**సుల్తానాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు మంగళవారం రాత్రి అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిరియాల ఉమామహేశ్వరి (16), సుశీల ఆకృతి (8) గోడ దూకి వెళ్లిపోయారు. ఈ ఘటనపై చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలికల ఆచూకీ తెలిసిన వారు వెంటనే సుల్తానాబాద్ ఎస్ఐ 8712656511 లేదా సీఐ 8712656510 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## అంగరంగ వైభవంగా శాఖంబరీ ఉత్సవాలు



**కరీంనగర్ రూరల్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో శాఖంబరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన బుధవారం అమ్మవారిని 54 రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని వ్యాసుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పల్లకి సేవ, సహస్రదీపాలంకరణ, ఉయ్యాల సేవలు ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ నిర్వహించారు. సువాసినీలు సౌందర్యలహరి ప్రారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మన్, కమిటీ సభ్యులు ముక్క ప్రభాకర్, నీరుమల్ల తిరుపతి, పడకంటి వినోద్‌కుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు కూలిపోయిన ఇళ్ల ప్రహరీ గోడలు



**సుల్తానాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సుల్తానాబాద్ పట్టణంలోని 9వ వార్డు గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న చల్లూరి బ్రహ్మచారి, పోగుల రమేష్‌ల ఇళ్ల ప్రహరీ గోడలు కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే 9వ వార్డు కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

## బీజేపీ సమక్షంలో ఆధ్యాత్మిక గురువు గూడ జగదీశ్వర శర్మకు ఘన సత్కారం



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వీణవంక మండలంలో గురుపౌర్ణమి వేడుకలను బీజేపీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితుడు, ఆధ్యాత్మిక గురువు బ్రహ్మర్షి గూడ జగదీశ్వర శర్మను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో గురువులకు అత్యున్నత స్థానం ఉందని, వేద విద్యలను భావితరాలకు అందిస్తూ సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంలో వేద పండితుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. జగదీశ్వర శర్మ వంటి మహనీయుల ఆశీస్సులు సమాజానికి రక్షణగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సిహెచ్. నరసింహ రాజు, పెద్ది మల్లారెడ్డి, ముత్యాల రవీందర్, కొమ్మటి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి నాగరాజు, ఉడుత కుమార్, బుద్ధ మహేందర్ గుప్త, ఆకుల రాజేందర్, గుజ్జ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన మేయర్ శ్రీనివాస్



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్‌లో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లోతట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. టూ టౌన్, మంచిర్యాల్ చౌరస్తా నాలా, వి-పార్క్ పరిసరాలతో పాటు పలు జలమయమైన ప్రాంతాలను సందర్శించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, వరద నీటి పారుదల పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో అదనపు యంత్రాంగంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. 43వ డివిజన్‌లో గోడ కూలిన ఘటనలో జేసీబీతో తొలగించి ప్రమాదాన్ని నివారించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మున్సిపల్ కాల్ సెంటర్ 98499 06694 లేదా స్థానిక కార్పొరేటర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పొన్నం లక్ష్మీ మొండయ్య, నునావత్ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి పర్వదినాన ఘనంగా కొండగట్టు గిరిప్రదక్షిణ



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురుపౌర్ణమి పర్వదినాన 43వ కొండగట్టు గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించగా, భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన కుమార్‌తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, ఎల్-నినో ప్రభావం తొలగి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించామని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాష్ట్ర దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని, కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రైతుల కష్టాలు తీరాలని, ప్రజలందరూ సుఖంగా ఉండాలని ఆధ్యాత్మిక భావనతో గిరిప్రదక్షిణ చేపట్టామని, భారీ వర్షంలోనూ పాల్గొన్న ప్రతి భక్తుడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్‌ల సమస్యలను పరిష్కారించాలని అదనపు కలెక్టర్‌కు వినతి



**పెద్దపల్లి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని 262 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం ప్రతినిధులు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు జంగ్ అనిల్ ఆధ్వర్యంలో బుధవారం ఈ వినతిపత్రం సమర్పించారు. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సరైన గుర్తింపు, అధికారాలు, గౌరవ వేతనం కల్పించాలని ఫోరం నాయకులు కోరారు. నెలకు ఉపసర్పంచ్‌లకు రూ.5,000, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని, అభివృద్ధి పనుల శిలాఫలకాలపై వారి పేర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా, పంచాయతీ నిధులతో చేపట్టే పనుల బిల్లులు, తీర్మానాలు, చెక్కులపై ఉపసర్పంచ్‌లకు సంతకం చేసే అధికారం ఇవ్వాలని, మండల స్థాయి గ్రామాభివృద్ధి సమావేశాలకు వారిని ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు జంపన్న, నాయకులు బోనగిరి అజయ్ కుమార్, ఎలిగేటి మల్లేశం, తీగుల్ల సతీష్ రెడ్డి, బరత స్వామి, సామల నాగభూషణం, అరిగె రవికమార్, తమ్మనవేణి రాజయ్య, కత్తెర్ల లచ్చయ్య, తడ్వాయి ప్రమోద్ రెడ్డి, కోల తిరుపతి, బెజ్జంకి యమున రాజేందర్, అఅయిలవేని తిరుపతి, దయ్యాల రజిత, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ సంపద పరిరక్షణకు ముందడుగు వేసిన ఎస్.ఆర్.ఆర్. కళాశాల



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ, జీవవైవిధ్య సంరక్షణ లక్ష్యంగా ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "సీడ్ ఎక్స్‌పో -- సీడ్ బాల్స్ తయారీ" కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ప్రారంభించి, చెట్ల పెంపకమే వాతావరణ మార్పులకు శాశ్వత పరిష్కారం అని పేర్కొన్నారు. ముఖ్య అతిథి డా. కె. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, విద్యార్థులు సీడ్ బాల్స్ ఉద్యమాన్ని సామాజిక ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 22 రకాల అరుదైన వృక్ష విత్తనాలను ప్రదర్శించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు. మామిడి, నేరేడు, టేకు, మోదుగ, వేప, మర్రి వంటి వృక్ష విత్తనాలు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీపై ప్రాయోగిక శిక్షణ ఇచ్చి, వర్షాకాలంలో అడవులు, కొండ ప్రాంతాలు, ఖాళీ భూముల్లో విసరడం ద్వారా సహజ అటవీ విస్తరణ సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా సీడ్ బాల్స్ తయారు చేసి విస్తరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, డిగ్రీ, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సిపి గౌష్ ఆలం



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రామడుగు పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధులపై సమీక్ష నిర్వహించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను సరైన పద్ధతిలో నమోదు చేయాలని, సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సమన్లు, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సీడీఆర్ వంటి అప్లికేషన్‌లను రోజువారీ విధుల్లో విస్తృతంగా వినియోగించాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగాన్ని కూడా తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విసిబుల్ పోలిసింగ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను గమనించాలని, ప్రతి నెల కొత్త సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, రామడుగు ఎస్సై రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలి - అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు




**పెద్దపల్లి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యాసంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన విజిలెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలు, బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్ జరగకుండా నిరంతర తనిఖీలు జరపాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో 410 చౌక ధరల దుకాణాల ద్వారా 2,46,981 రేషన్ కార్డుల ద్వారా 7,17,898 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని, కొత్తగా 30,909 కార్డులు మంజూరు చేసి 88,357 మందిని చేర్చినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు 13,645.968 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించబడిందని వెల్లడించారు. ప్రతి రేషన్ కార్డుదారుడి ఈకేవైసి ప్రక్రియను జూలై 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 82.31 శాతం లబ్ధిదారులు వఖ్జ పూర్తి చేశారని, మిగిలిన వారు గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 62 కేసుల్లో 579.80 క్వింటాళ్ల బియ్యం, 45 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద 1,18,953 కుటుంబాలకు 4,73,691 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి రూ.1,403.45 లక్షల సబ్సిడీ అందించినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

– కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. చెన్నూర్ మండలంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను, ప్రహరీ గోడ పనులను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు, మెనూ అమలు, విద్యార్థుల సంఖ్య పెంపు, గర్భిణుల జాబితా తయారీ, పౌష్టికాహారం, వైద్య సేవల నాణ్యతపై సూచనలు చేశారు. అలాగే ప్రాణహిత నది తీరాన్ని పరిశీలించి వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇండ్లు కూలిన బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు వర్తించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భగత్‌నగర్ డెకాయిటీ కేసును ఛేధించిన పోలీసులు



కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన సంచలన ఇంటి డెకాయిటీ కేసును పోలీసులు ఛేదించారు. ఉత్తరప్రదేశ్ మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ ఇంట్లో జరిగిన ఈ దోపిడీకి ఆయన సొంత అల్లుడు రజావుద్దీన్, మనుమడు అజీమ్ రజా ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగా రజావుద్దీన్ కుట్ర పన్ని, మీరట్‌కు చెందిన ముగ్గురితో కలిసి దాడి చేశారని పోలీసులు తెలిపారు. నిందితులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో కుటుంబ సభ్యులను బెదిరించి నగదు, ఆభరణాలు దోచుకెళ్లారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి, మీరట్‌లో గాలింపు చర్యలు చేపట్టి అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారు సల్మాన్ ఏ భూరే (22), సల్మాన్ ఏ విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19). వీరి వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేశారు. ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజా పరారీలో ఉండగా, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసులు



కరీంనగర్ రూరల్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ రూరల్ పోలీసులు ఒక భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించి నిందితుడు తగరం శంకర్ లాల్‌ను అరెస్ట్ చేశారు. అతను తన చిన్ననాటి స్నేహితుడి ఇంటి నుండి రూ.26 లక్షల నగదు అపహరించినట్లు దర్యాప్తులో బయటపడింది. బొమ్మకల్ బస్ స్టాప్ వద్ద వాహనాల తనిఖీల సమయంలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను పరారీలో ఉన్న రేష్మతో కలిసి ఈ నేరానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు రూ.17.60 లక్షల నగదు, ఒక స్విఫ్ట్ కారు, శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు. ప్రజలు అధిక మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను ఇళ్లలో భద్రపరచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.


## ఓటరు కార్డుకు ప్రభుత్వ పథకాలతో ఎలాంటి లింక్ లేదు

– కలెక్టర్ కె. హైమావతి



సిద్దిపేట, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఓటరు గుర్తింపు కార్డు ఏ ప్రభుత్వ సంక్షేమ పథకం, రేషన్ కార్డు, పెన్షన్, రైతు భరోసా, ఆరోగ్య పథకాలు లేదా ఇతర సేవలతో ఎలాంటి అనుసంధానం లేదని జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో ఎన్యూమరేషన్ ఫారం సమర్పిస్తే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలు అలాంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. అర్హులైన ఓటర్లు తమ బూత్ లెవల్ ఆఫీసర్ లేదా సమీప హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి వెంటనే ఫారం సమర్పించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారం కేవలం ఓటరు వివరాల నమోదు, సవరణ, ఎన్నికల సంఘం రికార్డుల నవీకరణ కోసమే ఉపయోగపడుతుందని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వో, ఈఆర్‌వో కార్యాలయం లేదా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి - కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, రెండు రోజుల్లో లోపాలను సరిదిద్దాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం, 80 నియోజకవర్గాల్లో 90 శాతం పైగా డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని వివరించిన కలెక్టర్ చిత్రా మిశ్రా, బీఎల్‌వోల ద్వారా 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటివరకు 81.27 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



కరీంనగర్/హుస్నాబాద్/ఖానాపూర్ , జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రవ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చబడ్డాయి. ఖానాపూర్ నియోజకవర్గంలోని బాదం కుర్తి ద్వీపంలో దత్తాత్రేయుని ఆలయ ంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొని పంచామృతాభిషేకం చేశారు. సర్పంచ్ పార్శపు రోహిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ మాదాసు నవీన్, స్థానిక నాయకులు ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖానాపూర్ మండల కేంద్రంలోని జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయంలో కూడా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారులు రామకృష్ణ శర్మ, మల్లేష్ పంతులు ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేసి, వర్షం కారణంగా ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో తిప్పకుండా ఆలయ ఆవరణలోనే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని కృష్ణానగర్‌లో శ్రీధర్మశాస్త్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 108 మంది దంపతుల చేత సామూహిక గోపూజోత్సవం జరిగింది. మయూరగిరి పీఠాధీశులు నమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో పూజలు వైభవంగా జరిగాయి. వ్యాసభగవానుడు లోకానికి 18 పురాణాలు, ఉపనిషత్తులు అందించి గురుస్థానాన్ని పొందాడని, గోమాతను ఆరాధించిన వారికి సకల దేవత అనుగ్రహం కలుగుతుందని పండితులు వివరించారు. అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించబడింది. హుస్నాబాద్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు గురువులను పూలు, పండ్లతో సత్కరించి తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రధానాచార్యులు శ్రీలత మాట్లాడుతూ గురువే జ్ఞానానికి మూలమని, వేదవ్యాస మహర్షి రచించిన మహాభారతం, పురాణాలు, బ్రహ్మసూత్రాలు, శ్రీమద్భాగవతం వంటి గ్రంథాలు గురు-శిష్య పరంపరకు మార్గదర్శకమని తెలిపారు. వర్షం ఉన్నప్పటికీ పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## వర్షాలతో రోడ్లపై నిలిచిన వరద నీటి తొలగింపు పనుల్లో సర్పంచులు



ఎలిగేడు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారీ వర్షాల కారణంగా గ్రామంలోని రోడ్లపై వరద నీరు నిల్వ ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ పరిస్థితిని గమనించిన నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, ర్యాకల్దేవుపల్లి సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి కాలువలను శుభ్రపరిచి, నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పారిశుద్ధ్య పనులను వేగంగా నిర్వహించారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచులు సూచించారు.

## కొండగట్టు గిరిప్రదక్షిణలో ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్, లాలపల్లి సర్పంచ్



ఎలిగేడు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, లాలపల్లి గ్రామ సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కొండగట్టులో 43 గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం చుట్టూ గిరిప్రదక్షిణ చేయడం వల్ల ఆధ్యాత్మిక భావన పెరిగి మనసు ప్రశాంతంగా ఉంటుంది. ముఖ్యంగా పౌర్ణమి రోజుల్లో భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ చేయడం ద్వారా స్వామివారి అనుగ్రహం లభించి భక్తుల కోరికలు నెరవేరుతాయి” అని అన్నారు. ఈ గిరిప్రదక్షణలో కొప్పేర వీరారెడ్డి, కొప్పేర మహిపాల్ రెడ్డి, కొప్పేర తిరుపతి రెడ్డి, పెద్ది కుమా రస్వామి, కొప్పెర రవీందర్ రెడ్డి, తిరు పతి రెడ్డి, గడ్డం మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ సాయిబాబ స్వామిని దర్శించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి హనుమాన్‌పేటలోని శ్రీ సాయిబాబ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తదనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. గురుపౌర్ణమి ఆధ్యాత్మికతను, గురువుల గొప్పతనాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యం.కే.ఆర్. డిగ్రీ కళాశాలలో ఘనంగా సినారే జయంతి వేడుకలు



దేవరకొండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మునగాల కొండల్‌రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారే) జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, “సాహిత్యం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. సినారే రచనలు సమాజానికి మార్గదర్శకాలు. ఆయన సాహిత్యం ద్వారా ఉన్నతమైన విలువలను నేర్చుకోవచ్చు” అని పేర్కొన్నారు. విద్యార్థులు సాహిత్యాన్ని చదివి సమాజానికి అన్వయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఢ తెలుగు విభాగాధిపతి జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, డా. వి. మకట్లాల్, తెలుగు అధ్యాపకులు ఏ. శ్రీనుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీవో 25 సవరణపై ఉపాధ్యాయుల నిరసన



ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రాథమిక పాఠశాలలకు విఘాతం కలిగేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 25ను వెంటనే సవరించాలని భైంసా మండల ప్రాథమిక ఉపాధ్యాయులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. 20 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 21 నుండి 40 మందికి ముగ్గురు, 41 నుండి 60 మందికి నలుగురు టీచర్లు, 60 మందికి పైగా ఉంటే ఒక పిఎస్ హెచ్ఎం, 60 నుండి 80 మంది విద్యార్థులు ఉంటే ఒక పిఈటీ టీచర్‌ను అదనంగా నియమించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ పల్స్కేల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ఉప్పొంగిన మత్తడి వాగు



ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మండలంలో కురిసిన భారీ వర్షాలకు గోసంపల్లె నడింపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మత్తడి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అలుగు నిండుగా నీరు పారడంతో రోడ్ డ్యాం కనబడకపోవడంతో పాత ఎల్లాపూర్, గోచంపల్లి, నడింపల్లి గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీగా నీరు రావడంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తూ పంటలకు సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు.

## 100 శాతం ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ పూర్తి



ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలోని 11వ వార్డు జెకె నగర్, రాజీవ్ నగర్, విద్యానగర్ కాలనీలకు సంబంధించిన 235, 236 బూత్‌లలో ఎస్ఐఆర్ సర్వే 100 శాతం పూర్తయిందని కౌన్సిలర్ రాజు రా సత్యం తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి అధికారులకు, సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు, కాలనీ వాసులకు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, వార్డు అధికారులు, యువకులు, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు, పార్టీ కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వర్షాల మధ్య ప్రజా సేవలో నేతలు



ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు కాలనీలు వరద ముప్పు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం కాలనీవాసులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. జెసిబి సహాయంతో నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అదే సమయంలో ఏడవ వార్డులో కౌన్సిలర్ నిమ్మల రమేష్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు మురికికాలువల్లో చేరడంతో మున్సిపల్ సిబ్బందితో వాటిని తొలగించే పనులు నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని ఆయన సూచించారు. భారీ వర్షాల మధ్య ప్రజా సేవలో ముందుండి స్పందించిన నేతలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## వాగు దాటక తప్పని పరిస్థితి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మైనార్టీ స్కూల్ విద్యార్థులు



ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలో బుధవారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్లు, మురికికాలువలు నీటితో నిండిపోయాయి. పాదాచారులు, వాహనదారులు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైటెక్ సిటీ కాలనీ, మైనార్టీ మోడల్ స్కూల్ మధ్యలో ప్రవహిస్తున్న వాగు ఉప్పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తాత్కాలికంగా వేసిన పైపులు వర్షానికి కొట్టుకుపోవడంతో అక్కడ నివసించే కుటుంబాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షాలతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తూ పంటలకు సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు.

## వర్షంలో విద్యుత్ ఉద్యోగుల నిరసన



కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాల ప్రైవేటీకరణకు ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగులు 18వ రోజు కూడా తమ ఆందోళన కొనసాగించారు. కరీంనగర్ టీజీ ఎన్‌పీడీసీఎల్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, అనంతరం వర్షాన్ని లెక్కచేయకుండా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రావు, శ్రీనివాస్, రఘు, రాజు, రమేష్, సంపత్ కుమార్, సంతోష్, రాచకొండ శ్రీనివాస్, రంగు వెంకటనారాయణ, యుగంధర్, నిఖిల్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
## మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య



**పెద్దపల్లి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. చందపల్లి 17వ వార్డు, పెద్దమ్మ నగర్, ఎస్ఆర్ఎస్పి కాలువ, రంగంపల్లి 11వ వార్డు సాయి గార్డెన్, రాంపల్లి డబుల్ బెడ్ రూంల వద్ద పరిస్థితిని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు వెళ్లరాదని సూచించారు. 24 గంటలు మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూంల వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్లు పూదరి మహేందర్, తోట ఫణిందర్ భూపతి, మోలుగురి కమల్, అక్కపల్లి సుజాత క్రాంతి, నాదీమ్, తూముల లత శుభాష్, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష




**పెద్దపల్లి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి రాజీవ్ రహదారి వద్ద వరద ఉధృతి పరిస్థితిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్లు పూదరి మహేందర్, తోట ఫణిందర్ భూపతి, అక్కపల్లి క్రాంతి సుజాత, నదీమ్, తూముల లత సుభాష్, మోలుగురి కమల్, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వీవో భవనానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ మండల కేంద్రంలో నిర్మించనున్న వీవో భవన పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి వీవో భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ వీవీ వరలక్ష్మి, సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు గౌడ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, కోంద్ర సురేశ్, రఘు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కడెం ప్రాజెక్టుకు భారిగా చేరుకుంటున్న వరద నీరు



**ఖానాపూర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు కురవడంతో నీటిమట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 700 అడుగులు కాగా, నీటిమట్టం ఆ స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. పరిస్థితిని బట్టి డ్యాం నుండి నీటిని వదులుతామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు దిగువన నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పల్లెకారులు నది ఒడ్డుకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై హెచ్చరిక




**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, పశువుల కాపరులు విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, పరికరాలను తాకరాదని, తెగిపోయిన తీగలకు దగ్గరగా వెళ్లరాదని, చెట్ల క్రింద నిలబడరాదని ఆయన సూచించారు. రైతులు మోటార్లు, పైపులు, స్టార్టర్లకు సరైన ఎర్తింగ్ చేయించుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్వయంగా పనులు చేయరాదని, పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆడనివ్వకూడదని హెచ్చరించారు. విద్యుత్ షాక్ సంభవించినప్పుడు బాధితుడిని నేరుగా తాకకుండా, విద్యుత్ ప్రసారం చేయని వస్తువులతో వేరు చేసి వెంటనే వైద్య సహాయం అందించాలని సూచించారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం లేదా లోపం గమనించిన వెంటనే టీజీ ఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు

# రెవెన్యూ రికార్డులను పక్కగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చందంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని దేవరకొండ ఆర్డిఓ బి. పద్మప్రియతో కలిసి సందర్శించారు. తహసిల్దార్ సత్యనారాయణతో పాటు సిబ్బందితో రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల చేపట్టిన భూముల రీ-సర్వే, అటవీ భూములు, రెవెన్యూ భూములు, సాధారణ సర్వేలో తలెత్తు తున్న సమస్యలను గ్రామాల వారీగా పరిశీలించారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టిలకు ప్రాధాన్యత ఇచ్చి, ఆ రెండు గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను స్పష్టత వచ్చేలా రూపొందించాలని సూచించారు. వారం, పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావాలని తహసిల్దారును ఆదేశించారు. ఇందుకోసం ప్రతిరోజు కనీసం మూడు నుండి నాలుగు గంటలు ఈ అంశంపై పనిచేయాలని ఆయన సూచించారు. భూముల రీ-సర్వే సందర్భంగా తలెత్తుతున్న సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మండలంలో భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, రీ-సర్వే అంశాలను ఆర్డిఓ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొగిళ్లకు సంబంధించిన రికార్డులను ఇప్పటికే పరిశీలించినందున వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని పొగిళ్ల రికార్డులను సిద్ధం చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

## ఎల్ నినో దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ డివిజన్ పరిధిలోని చందంపేట ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు .ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరాను జాగ్రత్తగా పర్యవేక్షించాలని, నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా కందులు, కూరగాయలు, కీరదోస వంటి పంటలను సాగు చేసుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములను పడావుగా ఉంచవద్దని, ఆరుతడి పంటలకు కావలసినంత విత్తనం ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారులను ఆయన ఆదేశించారు.

# పవర్ లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి : సీఐటీయూ



**నల్లగొండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పవర్ లూమ్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 30 నాటికి కూలీ ఒప్పంద గడువు ముగుస్తుందని, యజమానులు వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం పవర్ లూమ్ కార్మికులకు ఇల్లు లేని వారికి 120 గజాల స్థలం కొనుగోలు చేసి, పది లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందించాలని, నిరుపేద కార్మికులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, పవర్ లూమ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గంజి నాగరాజు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కనీ్వనర్ అవుట రవీందర్, సభ్యులు గంజి రాజేష్, ఉపాధ్యక్షుడు పెండెం బుచ్చి రాములు, కార్యదర్శి సూరపల్లి భద్రయ్య, కోశాధికారి ఎల్లము ఆంజనేయులు, మహిళా కార్యదర్శి మిర్యాల శ్రీవాణి, దొంత యాదగిరి, మిర్యాల నరేష్, సూరపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

# నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితుల ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**మర్రిగూడ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని నర్సిరెడ్డిగూడెం భూ నిర్వాసితుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పరిశీలించారు. శివన్నగూడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన బిల్లులు ఎటువంటి తేడా లేకుండా సకాలంలో చెల్లించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించాలని సూచించారు. భూ నిర్వాసితులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల స్థలాలు కేటాయించాలని, చింతపల్లిలో కేటాయించిన స్థలాలతో పాటు పరిహారం అందించాలని కోరారు. ఇళ్ల స్థలాలు లేని 32 మంది లబ్ధిదారులకు త్వరగా స్థలాలు కేటాయించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య, మర్రిగూడ ఎస్సై బి. రాంబాబు, శివన్నగూడ సర్పంచ్ రాపోలు యాదగిరి, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# కుభ్యతండా గ్రామంలో జలసిరి, పంట నమోదు కార్యక్రమం



**మాడుగుల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని కుభ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం మరియు పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఈ రెండు కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించి, పంటల నమోదు విధానం, నీటి వినియోగం, సాగు సౌకర్యాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శివకుమార్, అందుగుల రెవెన్యూ క్లస్టర్ జోష్నా, గ్రామ సర్పంచ్ దేవి--దేవరాజ్, ఉప సర్పంచ్ భాష నాయక్, మాజీ ఎంపిటిసి భారతి గోపీనాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ సర్దార్ నాయక్, 4వ వార్డు సభ్యుడు మోహన్ నాయక్, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు సర్దార్ నాయక్, హన్మ నాయక్, దిప్ల, శ్రీను, చాంది సురేష్, అమృ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహణ



**హుస్నాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అందరం సమష్టిగా ఎదుర్కోవాలని, తాగునీటి సమస్యలు, వ్యవసాయానికి ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్, రవాణా, పంచాయతీరాజ్, విద్యా అంశాలపై చర్చిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జి పనులు చేపట్టాలని, 2.5 ఎకరాలకు పైగా ఉన్న రైతులకు బావి తవ్వుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఆయిల్‌ఫామ్ సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ అందించబడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో సాంక్షన్ అయిన పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్లు నిర్మించి విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో జలశక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామ ప్రజా ప్రతినిధులు పెండింగ్ పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# పట్టుపురుగుల పెంపకంపై రైతులు దృష్టి సారించాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక ఆదాయం అందించే పట్టుపురుగుల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. కలెక్టరేట్‌లో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన "నా పట్టు నా అభిమానం--2.0" సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో 1,313 ఎకరాల్లో 482 మంది రైతులు మల్బరీ సాగు చేస్తున్నారని తెలిపారు. ఒక ఎకరంలో ఏడాదికి ఐదు పంటలు తీసుకుని రూ.2--3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను పట్టు పరిశ్రమ వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. విజయవంతమైన పట్టు క్షేత్రాల సందర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టు మార్కెటింగ్‌కు అవసరమైతే భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రైతులు తమ పొలాల్లో ఉచిత ఫామ్‌పాండ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారులు, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు పాల్గొన్నారు.

# నీరు, పారిశుద్ధ్య మిషన్ పై సమీక్షా సమావేశం




**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే వివిధ శాఖల జిల్లా అధికారులతో నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ (డిడబ్ల్యూఎస్‌డబ్ల్యూ) పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా పంచాయతీ అధికారి, వ్యవసాయ అధికారి, సంక్షేమ అధికారి, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాలలు, రైతు వేదికలు, వైకుంఠ ధామాలు, గ్రామీణ ఆసుపత్రులు, అంగన్వాడీలకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణ అంశాలపై సమీక్ష చేపట్టారు.

# 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63.621 కిలోల గంజాయి దహనం



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63.621 కిలోల గంజాయి, ఒక గంజాయి మొక్కను బుధవారం ధ్వంసం చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలోని వెంకటరమణ ఇన్సినేటర్‌లో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్, జివెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రఫీక్, శ్రీలత, ఆర్ఐలు రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి, ఇన్సినరేటర్ ప్లాంట్‌కు చెందిన తిరుపతి, ప్రభాకర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన







**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు కళాభారతి వేదికగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి మహమ్మద్ అతిక్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమం అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే కుట్ర అని ఆయన అన్నారు. తెలంగాణలో కూడా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని, నీట్ పేపర్ లీకేజ్‌పై నెలరోజుల తర్వాత స్పందించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపుతోందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందకపోవడం విద్యార్థుల భవిష్యత్తుకు వెన్నుపోటు అని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## ప్రధాన వరద నీటి కాలువ పరిశీలించిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిన్న రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు కాశ్మీర్ గడ్డ, ముకరంపుర, భగత్ నగర్ గుండా ప్రవహించే ప్రధాన వరద నీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని దాదాపు 70 శాతం మురుగు, వరద నీరు ఈ కాలువ ద్వారానే ప్రవహిస్తుందని, రోడ్లపై నీరు చేరకుండా దీని ప్రాముఖ్యత ఎంతో ఉందని పేర్కొన్నారు. సుమారు 20--25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కాలువలో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా అని తనిఖీ చేసి, భవిష్యత్తులో మరమ్మతులు చేపట్టే అంశాలపై దృష్టి సారించారు.ప్రస్తుతం ఉన్న వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మురుగు మరియు వరద నీరు నిరాటంకంగా ప్రవహించేలా కొత్త డ్రైన్ నిర్మాణం చేసి, దానిపై స్లాబులు వేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

## రైతు పరిరక్షణ జిల్లా అధ్యక్షుడిగా బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి నియామకం



**గంగాధర, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ రైతు పరిరక్షణ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. గతంలో నీటి సంఘాల అధ్యక్షుడిగా, సింగిల్ విండో డైరెక్టర్గా పనిచేసిన అనుభవం ఉన్న ఆయన రైతుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.రైతు సంఘాల పథకాల విస్తరణ, అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు మద్దతు ఇవ్వాలని, మండల స్థాయిలో గ్రామ రైతు కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి ఎన్నికపై రైతులు అభినందనలు తెలిపారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలోంచిన ఎమ్మెల్యే విజయ రమణారావు



**సుల్తానాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ రమేష్, 15వ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవి కలిసి మున్సిపల్ పరిధిలోని 4వ, 15వ వార్డులలో పర్యటించారు.వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రం చేయించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కమిషనర్ రమేష్ లేదా చైర్మన్ బిరుదు రాధాకృష్ణకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని అధికారులు తెలిపారు.

## నీట్ పేపర్ లీక్ ఘటనపై ఆగస్టు 6 నుంచి సిపిఐ పాదయాత్ర



**హుస్నాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పేపర్ లీక్ ఘటనపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని, లేకపోతే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.హుస్నాబాద్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులపై లాఠీ ఛార్జ్ అమానుషమని, సుప్రీం కోర్టు స్పందించకపోవడం సరికాదని విమర్శించారు.దేశంలో మార్పు అవసరమని, "బిజెపి పోవాలి" నినాదంతో ఆగస్టు 6 నుంచి 15 వరకు పల్లె పల్లెకు సిపిఐ పాదయాత్రలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు.ఈ సమావేశంలో కర్రె బిక్షపతి, జాగీర్ సత్యనారాయణ, గడిపె మల్లేశ్, అదరి శ్రీనివాస్, కనుకుట్ల శంకర్, బొయిని అశోక్, గూడెం లక్ష్మి, ఉట్కూరి రాములు, బత్తుల బాబు, బాషబొయిన సంతోష్, తెరాల సత్యనారాయణ, జనగాం రాజ్‌కుమార్, గాంభీరపు మధు, తొట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆసుపత్రి విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహిం చారు .కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, లీకేజీలు, మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, విద్యుత్ పనులు, అదనపు బెడ్ల ఏర్పాటు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.తనిఖీ అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, ఇతర వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ఆదాయం-వ్యయాలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, పరికరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేసి, ప్రతి నెల బడ్జెట్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి



**: జిల్లా అకాడమిక్ ఆఫీసర్ పి.ఎం. షేక్**

**ఎలిగేడు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఆధునిక బోధన పద్ధతులను అలవర్చుకుని విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా అకాడమిక్ ఆఫీసర్ పి.ఎం. షేక్ సూచించారు. ఎలిగేడు మండలంలోని సుల్తాన్పూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు జరుగుతున్న సమగ్ర వృత్త్యంతర శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ శిక్షణలో నేర్చుకున్న నూతన బోధన వ్యూహా లను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేస్తే విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం రెమిడియల్ తరగతుల నిర్వహణ విధానం, సిలబస్ విశ్లేషణ, వార్షిక కార్యాచరణ ప్రణాళిక, ఆధునిక బోధన వ్యూహాలు వంటి అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ముప్పిరి తోట ఎంపీపీఎస్ హెచ్‌ఎం కోమల సంపత్ విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచినందుకు సన్మానించబడ్డారు. కార్యక్రమంలో ఎంఈఓ నరేంద్ర చారి, రిపోర్టర్లు వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్, రాజేష్ కుమార్, వెంకటేశ్వర్లుతో పాటు మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,
ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో రోడ్లపై నిలిచిన వరద నీరు తొలగింపునకు సర్పంచ్ కప్పల ప్రవీణ్ చర్యలు



**ఎలిగేడు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు గ్రామంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ వెంటనే స్పందించి పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు.గ్రామంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలువలను పరిశీలించి నీరు సాఫీగా బయటకు వెళ్లేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పంచాయతీ సిబ్బందితో కలిసి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించి వరద నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో రోడ్లపై నిల్వ ఉన్న నీరు క్రమంగా తగ్గి ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "వర్షాకాలంలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా నీరు నిల్వ ఉండడం, కాలువలు మూసుకుపోవడం లేదా ఇతర సమస్యలు కనిపిస్తే వెంటనే గ్రామ పంచాయతీకి సమాచారం అందించాలి" అని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బ్రహ్మోజు సంజీవ్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు బోగి సతీష్, సీనియర్ నాయకులు బత్తిని నగేష్, గుండేటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్



**నాగర్‌కర్నూల్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూలు, దేశ ఇటిక్యాల్ బూత్‌లను సందర్శించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన బీఎల్ఏలు, బూత్ కార్యకర్తలతో మాట్లాడి కార్యక్రమం పురోగతి, ఓటరు వివరాల పరిశీలన, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమాచారం సేకరించారు. ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అదేవి ధంగా, "బూత్ బలోపేతమే భారతీయ జనతా పార్టీ విజయానికి బలమైన పునాది" అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్,
పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**



**నల్లగొండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురు పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని శివాజీ నగర్, ముషంపల్లి రోడ్లోని సాయిబాబా దేవాలయాలలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, నల్లగొండ మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ వేడుకలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు యామ కవితా దయాకర్, మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్ రెడ్డి, బచ్చలకూరి హర్ష వర్ధన్తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల సంక్షేమమే లక్ష్యం..

**- సర్పంచ్ శానమోని సత్యం**

**- 'బంగారు తల్లి' పథకం కింద నవజాత ఆడబిడ్డకు రూ.5,016 ఆర్థిక సహాయం**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆడబిడ్డల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో సింగంపల్లి గ్రామపంచాయతీ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామ సర్పంచ్ శానమోని సత్యం ఆధ్వర్యంలో 'బంగారు తల్లి' పథకం కింద గ్రామంలో జన్మించిన నవజాత ఆడబిడ్డకు రూ.5,016 ప్రోత్సాహక నగదును బుధవారం అందజేశారు. చింతకింది శిల్ప--నాగేష్ దంపతులకు ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ, ఆడబిడ్డ కుటుంబానికి గర్వకారణమని, వారి విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని సర్పంచ్ శానమోని సత్యం పిలుపునిచ్చారు. గ్రామంలో ఆడబిడ్డల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీంద్ర, వార్డు సభ్యులు అయోధ్య, శానమోని తానేష్, గ్రామ యువకులు శ్రీను, శేఖర్, ప్రభాకర్, వంశీ, శ్రీశైలం, మణి, చింటూ తదితరులు పాల్గొని నవజాత శిశువుకు ఆశీర్వాదాలు అందించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కొండగట్టులో గిరిప్రదక్షిణలో పాల్గొన్న వొడితల ప్రణవ్



**మల్యాల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొండగట్టులో జరిగిన గిరిప్రదక్షిణలో హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులకు ఎల్ నీ నో ప్రభావం లేకుండా ప్రజలు సుభిక్షంగా ఉండాలని అంజన్నను మొక్కుకు న్నారు .కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మున్నూరు కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు బొమ్మ శ్రీరామ్ హాజరయ్యారు. భారీవర్షం మధ్య భక్తులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణ పూర్తి చేసి అంజన్న అనుగ్రహం కలిగిందని భావించారు.ప్రణవ్ మాట్లాడుతూ అంజన్న ఆశీస్సులతో ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఎల్ నీ నోపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, కౌశిక్ రెడ్డి కరువు కాంగ్రెస్ తెచ్చిందని మాట్లాడడం అవివేకమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి



**జగిత్యాల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన, చరవాణి ద్వారా కలెక్టర్‌తో మాట్లాడి మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య, వాటర్ సప్లై, విద్యుత్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల సంస్థలతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బలహీనంగా ఉన్న కట్టలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు నిత్యావసర వస్తువులు, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని అర్వింద్ సూచించారు.

## సంక్షేమ హాస్టళ్లలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్



**అమ్రాబాద్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో వెంటనే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు ఎండి సయ్యద్ డిమాండ్ చేశారు.వర్షాకాలంలో దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జలుబు, జ్వరం వంటి అంటువ్యాధులు విపరీతంగా వ్యాపిస్తున్నాయని, ముఖ్యంగా హాస్టళ్లలో పరిశుభ్రత లోపించడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి హాస్టల్‌లో వైద్య బృందాలతో ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ, శానిటైజేషన్, ఫాగింగ్, తాగునీటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని, నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఇప్పటికే పలు హాస్టళ్లలో విద్యార్థులు జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు



**వెల్దండ, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కల్వకుర్తిలో గురు పౌర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్ గురువుల మహోన్నత సేవలను స్మరించు కుంటూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు సంగీతం, నృత్యం, వాద్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత, భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోడం భాస్కర్, స్వరాలయ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఉపాధ్యాయ బృందం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అచ్చంపేట తొమ్మిదో వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం



**అచ్చంపేట, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణ కేంద్రంలోని తొమ్మిదో వార్డులో "మన ఓటు -- మన హక్కు" నినాదంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు.అచ్చంపేట ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జి రాములు నాయకత్వంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఓటర్ పేపర్ అందజేసి, త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. "మన ఓటు -- మన బాధ్యత" అని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తొమ్మిదో వార్డు ఇన్‌చార్జి రాములు, కొండూరు శేఖర్, భరత్ కుమార్, ఐఎన్టీయూసీ నాయకుడు మహబూబ్ అలీ, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజగోపాల్, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షానికి పొంగిపొర్లిన మ్యాన్‌హోల్లు జలమయం అయిన రహదారులు



**బోడుప్పల్, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్ సర్కిల్--10 పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ మ్యాన్‌హోల్లు పొంగిపోర్లడంతో ఎగువనున్న రాజీవ్ నగర్, దేవేందర్ నగర్ నుండి వరదనీరు దిగువనున్న అంబేద్కర్ నగర్, జ్యోతి నగర్, సాయిదుర్గ కాలనీల రహదారుల్లోకి చేరి పూర్తిగా జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న బోడుప్పల్ 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దానగాళ్ల అనిత యాదగిరి కాలనీ వాసులతో కలిసి పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ, "చిన్నపాటి వర్షానికే అంబేద్కర్ నగర్ చౌరస్తాలోని మ్యాన్‌హోల్ పొంగిపోరడంతో రహదారులు జలమయం అవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు పెద్ద సైజ్ పైపులు అమర్చి నాలాలో కలిపేలా చర్యలు తీసుకుంటామని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ ఇప్పటికే హామీ ఇచ్చారు" అని తెలిపారు. గతంలో రాజీవ్ నగర్ కాలనీ వర్షపు నీరు సీమ్యాప్ కంపెనీలోకి ప్రవహించేదని, ప్రస్తుతం కంపెనీ వారు ప్రహరీ గోడ నిర్మించడంతో సమస్య తీవ్రతరం అవుతోందని, దీనిపై కంపెనీ అధికారులతో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించారని అనిత యాదగిరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, రాజీవ్ నగర్ యూత్ ప్రెసిడెంట్ గడ్డి రమేష్, ప్రవీణ్, రాజబోయిన వేణు యాదవ్, శ్రీనివాస్, వెంకటేష్, సందీప్, రాజు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులు, దళితులకు న్యాయం చేయాలి

**– లండం చిన్న జంగయ్య**
**– విద్యా కమిషనర్ డా. చారకొండ వెంకటేష్‌ను కలిసి వినతి.. సానుకూల హామీ**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు ప్రాంతంలోని పేద విద్యార్థులు, దళితులు ఎదుర్కొంటున్న విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ డా. చారకొండ వెంకటేష్‌ను కలిసి కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ కళాశాల స్థల సమస్యతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన విద్యా కమిషనర్ డా. చారకొండ వెంకటేష్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే ఆమనగల్లు ప్రభుత్వ కళాశాల స్థలాన్ని స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, పేద విద్యార్థులు, దళితులకు సమన్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య మాట్లాడుతూ, విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆమనగల్లు ప్రభుత్వ కళాశాల సమస్యను ప్రాధాన్యంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఎడ్యుకేషనల్ కోఆర్డినేటర్ లండం యాదయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ లండం రాఘవేందర్, లండం మహేష్, లండం చింటూ, లండం పెద్ద పుల్లయ్య, బయ్యా చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# కానుగుల దశరథంకు ఘన సన్మానం

**– నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా అభినందనలు**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కానుగుల దశరథంకు బుధవారం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఘన సన్మానం నిర్వహించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్‌గా కానుగుల దశరథం ఎన్నిక కావడం నాయి బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘం మరింత బలోపేతం కావడంతో పాటు నాయి బ్రాహ్మణుల సంక్షేమం, సామాజిక అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు విశేష కృషి జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రతి సభ్యుడికి అండగా నిలుస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కానుగుల దశరథం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్, సర్పంచ్ రజిత రాజు, పురుషోత్తం తదితరులు పాల్గొని నూతన రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సాయిబాబా సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవం

**– గురుపౌర్ణమి మహోత్సవాలకు పోటెత్తిన భక్తజనం**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్ పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా సేవాసంస్థ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన వేడుకలు శ్రీ సాయినాథునికి మంగళస్నానం, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సామూహిక హోమం, భజన కార్యక్రమాలు, పల్లకీ సేవ, మహా మంగళహారతి, తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గురుపౌర్ణమి సందర్భంగా వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘసేవకుడు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించే పవిత్ర పర్వదినమని అన్నారు. సాయిబాబా బోధించిన ప్రేమ, సేవ, దయ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం, సేవాభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మధుసూదన శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో హారతులు స్వీకరించి తీర్థప్రసాదం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాపిశెట్టి రామన్న, ఆంజనేయులు, నయనాచారి, రవికిరణ్, శివాజీ, లింగంపల్లి ఆనంద్, రాములు, మల్లికార్జున్, కౌన్సిలర్లు జగన్, భాగ్యలక్ష్మి, సునీత, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దారుల చిత్తరంజన్ దాస్, రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, భుజంగం, లక్ష్మీపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం పంపిణీ చేయగా, గురుపౌర్ణమి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కడ్తాల్‌లో నూతన హోండా షోరూం ప్రారంభం

**– వినియోగదారులకు మరింత చేరువగా సేవలందిస్తామని నిర్వాహకుల వెల్లడి**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో ద్వారక హోండా నూతన షోరూం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. షోరూం వ్యవస్థాపకులు బేల్మన్ అభిషేక్ రావు, హోండా జోనల్ సేల్స్ హెడ్ సునీల్ రెడ్డి, జోనల్ సర్వీస్ హెడ్ సురేష్ సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా హోండా సంస్థ గ్రామీణ ప్రాంతాలకు కూడా తన సేవలను విస్తరిస్తోందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, ఇంధన పొదుపు, విశ్వసనీయత, మెరుగైన పనితీరుతో హోండా ద్విచక్ర వాహనాలు దేశవ్యాప్తంగా వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు. విక్రయాలతో పాటు సర్వీసింగ్, విడిభాగాలు, ఆర్థిక సౌకర్యాలు ఒకేచోట అందుబాటులో ఉండేలా షోరూంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. హోండా వాహనాలపై ప్రత్యేక ఆఫర్లు, సులభ వాయిదా పద్ధతులు, అమ్మకాల అనంతర సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని నిర్వాహకులు తెలిపారు. ఈ షోరూం ద్వారా కడ్తాల్ మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ ప్రకాష్, ఏరియా సర్వీస్ ఇన్‌చార్జ్ సుబిన్, స్టేట్ ఫైనాన్స్ బోర్డ్ సభ్యుడు ఆసిఫ్ అలీ, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ గూడూరు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, నిర్వాహకులు వెంకటేశ్వర రెడ్డి, రామకృష్ణ, చేగురి వెంకటేష్, రాములు, అశోక్, ఎర్రోళ్ల రాఘవేందర్, లాయక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## సరికొండలో 'తెలంగాణ జలసిరి'కి శ్రీకారం

**– గ్రామసభ నిర్వహణ.. ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** :ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని భూగర్భ జలాలను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమానికి సరికొండ గ్రామంలో శ్రీకారం చుట్టారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ లాలయ్య ఆధ్వర్యంలో, సర్పంచ్ పాలకూర మహేందర్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి గ్రామపంచాయతీ ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అధికారులు జలసిరి కార్యక్రమం లక్ష్యాలను గ్రామస్థులకు వివరించారు. ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి చేరేలా చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, ప్రతి ఇంటి వద్ద మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు, ఎండిపోయిన బోరుబావులకు రీఛార్జ్ వ్యవస్థలు కల్పించడం, ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులను చేపట్టడం, వ్యవసాయ పొలాల్లో ఫామ్ పాండ్లు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం వంటి కార్యక్రమాలు జలసిరిలో కీలకమని తెలిపారు. "ప్రతి బొట్టును ఒడిసిపడదాం.. జలసిరితో కరువును జయిద్దాం" అనే సందేశంతో వర్షపు నీటి సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకూర మహేందర్ గౌడ్, ఉప సర్పంచ్ బలవంత్ రెడ్డి, ఎంపీఓ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ సద్గుణ, వార్డు సభ్యులు, మాజీ జెడ్పీటీసీ/ఎంపీటీసీ అద్దాల రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గౌని లక్ష్మయ్య, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో ఏబీవీపీ సభ్యత్వ నమోదు జోరు

**– విద్యార్థులంతా సభ్యత్వ నమోదు చేసుకోవాలి.. నాయకుల పిలుపు**



**ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆమనగల్లు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు పురుగుల శివ, ఆమనగల్లు నగర కార్యదర్శి చెన్నంశెట్టి మల్లేష్ మాట్లాడుతూ, 1949 జూలై 9న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఓం ప్రకాశ్ బహల్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఏబీవీపీ నేడు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా రంగ అభివృద్ధి, జాతీయ చైతన్యం, సామాజిక అంశాలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విద్యార్థుల గొంతుకగా ఏబీవీపీ పనిచేస్తోందన్నారు. విద్యార్థుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన విద్యార్థి సంఘమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థిని ఏబీవీపీ సభ్యత్వం నమోదు చేసుకుని విద్యార్థి శక్తిని బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లండం మల్లేష్, గోరటి భరత్, కోట్ర సురేష్, గోపిగిరి నరేష్, నేనవత్ సురేష్ నాయక్, నేనవత్ సుమన్ నాయక్, పసుల చరణ్, నవీన్ నాయక్, ప్రశాంత్ నాయక్, విద్యార్థులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సోదరుడికి శ్రీకృష్ణ కాలచక్రం ఆహ్వాన పత్రిక అందజేత



**కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్లో శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహా యాగ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని దుర్గం చెరువు వద్ద ఆయన నివాసంలో యాగ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, మహా యజ్ఞానికి హాజరవుతానని యాగ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు వాస శేఖర్, మాజీ ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్, వాసవి క్లబ్ డిస్టిక్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ దుగ్గిళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లం పట్టిక వాహనం సీజ్



**కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో అక్రమంగా నల్ల బెల్లం, స్పటిక సరఫరా జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. వెల్దండ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా, హైదరాబాద్ బేగంబజార్ నుండి అక్రమంగా కొనుగోలు చేసిన నల్ల బెల్లం పొడి 600 కేజీలు, స్పటిక 120 కేజీలు స్కార్పియో వాహనంలో తరలిస్తున్న ఇస్లావత్ రాజును ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడు తలకొండపల్లి మండలంలోని మొగిలి తండాకు చెందినవాడని, మన్ననూరు గ్రామంలో నాటుసారా తయారీదారులకు సరఫరా చేయడానికి వస్తుండగా పట్టుబడ్డాడని ఎక్సైజ్ సీఐ జె. వెంకట్ రెడ్డి తెలిపారు. వాహనాన్ని, నల్ల బెల్లం, స్పటికను సీజ్ చేసి కల్వకుర్తి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది జనార్దన్ రెడ్డి, సిద్ధార్థ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తిలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గురువారం కల్వకుర్తి పట్టణంలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు పట్టణ పరిధిలోని కైలాసం గుట్టపై అయ్యప్ప స్వాముల (విరి) మండపాన్ని సందర్శిస్తారు. అనంతరం 6 గంటలకు వేపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని దర్శించనున్నారు. రాత్రి 7:30 గంటలకు యూత్ కాంగ్రెస్ నాయకుడు షేక్ జావిద్ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ వివరాలను ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం బుధవారం మీడియాకు వెల్లడించింది.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత



కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామ శివారు వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకుని కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## వంగూరు పోలీస్ స్టేషన్ తరలింపుపై తీవ్ర వ్యతిరేకత



వంగూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వంగూరు మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న పోలీస్ స్టేషన్‌ను శ్రీశైలం రహదారిపైకి తరలించాలనే ప్రతిపాదనపై గ్రామ ప్రజలు, రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు, యువకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు.మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వేనెపల్లి గణేష్ రావు మాట్లాడుతూ, "ప్రజల మధ్యలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను రహదారిపైకి తరలించడం ప్రజలకు రక్షణ లేకుండా చేయడమే" అని మండిపడ్డారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వో మురళీమోహన్కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మత్తు నియంత్రణపై కలెక్టర్ ఎస్పీ సమీక్ష



నంద్యాల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్షా సమావేశం జరిగింది.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఐపీఎస్ సంయుక్త అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం, నియంత్రణ చర్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, ఎస్‌డీపీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు.

## వైసీపీ ఎంపీల వైఖరిపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి విమర్శలు



నందికొట్కూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వైసీపీ ఎంపీల వైఖరిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తీవ్రంగా తప్పుపట్టారు.ఆమె మాట్లాడుతూ, "నిజమైన కామెడీ జాతి రత్నాలు వైసీపీ ఎంపీలు. వాళ్లని చూసే సినిమా తీశారేమో అనిపిస్తోంది. ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వైసీపీ, టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టిన పార్టీ. ఇప్పుడు నారా లోకేష్ గురించి మాట్లాడటం హాస్యాస్పదం" అని ఎద్దేవా చేశారు.పేపర్ లీకేజీని అరికట్టే కీలకమైన బిల్లుపై సభలో చర్చించాల్సిన సమయంలో వైసీపీ ఎంపీలు పారిపోతున్నారని ఆమె విమర్శించారు. "ఎప్పుడు శవాలు దొరుకుతాయా, ఎప్పుడు శవయాత్రలు చేద్దామా అని చూసే మీకు మేము చేస్తున్న అభివృద్ధి కనిపించదు. జంతర్మాంతర్ వద్ద వివిధ పార్టీల ఎంపీలు నిరసనలకు మద్దతు తెలిపినా, వైసీపీ ఎంపీలు మాత్రం ఎందుకు మద్దతు ఇవ్వలేదో ప్రజలకు చెప్పాలి" అని ప్రశ్నించారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నేతలు ప్రజా సమస్యల కంటే స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని డాక్టర్ శబరి లోక్‌సభలో, పార్లమెంట్ బయట మీడియాతో వ్యాఖ్యానించారు.

## ప్రతిష్టాత్మకంగా "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" ఎమ్మెల్యే గిత్త



నందికొట్కూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం మద్దూరు పంచా యితీలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు గిత్త జయసూర్య ఆధ్వర్యంలో ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని, కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల్లో టిడిపిపై మరింత నమ్మకం, విశ్వాసం పెరిగింది. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల విషయాన్ని ఇప్పటికే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు విడుదలై పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాములపాడు మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల కోసం మరింత బలంగా పోరాటం

**- గురుపౌర్ణమి సందర్భంగా ఉప్పుల నర్సింహాకు ఘన సన్మానం**



ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణ, దళిత హక్కుల సాధన, అంటరానితనం నిర్మూలన, కుల వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహాకు గురుపౌర్ణమి సందర్భంగా ఘన సన్మానం లభించింది. బుధవారం గుంటూరులోని మోహన్ రంగా స్వామి దేవాలయంలో నిర్వహించిన ఆది జాంబవ గురుపూజా మహోత్సవంలో ఆధునిక జాంబవంతులుగా పేరుపొందిన డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా ఆయనను శాలువాతో సత్కరించి, ఆది జాంబవ మహాముని చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పుల నర్సింహా మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఎస్సీ రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు దళితుల హక్కుల సాధన కోసం మరింత బలంగా పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు కర్నె శ్రీశైలం ఆశయాల సాధన కోసం తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశ తిలక్, బంగారు శృతి, వెంకట నర్సయ్య, ముక్క స్వామి, రాంకీ జాంబవ, రఘుపతి తదితరులు పాల్గొని ఉప్పుల నర్సింహాను అభినందించారు. గురుపౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ సన్మానం దళిత ఉద్యమ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## అక్షర వనంలో సాంప్రదాయ సంస్కృతితో గొప్ప విద్య



కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి పట్టణంలోని అక్షరవనం ఆశ్రమ పాఠశాలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ సందర్శించారు.అక్షరవనం పాఠశాలలో విద్యార్థులు స్వయంగా వంట చేసుకోవడం, గోశాల నిర్వహణ, గార్డెనింగ్ వంటి లైఫ్ స్కిల్స్ నేర్చుకుంటూ పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం అవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. పూర్వకాల గురుకులాల వలె విద్యతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడం ఎంతో గొప్పదని, "ప్రాక్టికల్ విద్య లేని విద్య, విద్య కాదని" ఆయన వ్యాఖ్యానించారు. సనాతన సాంప్రదాయంలో దాగి ఉన్న గొప్ప విద్యను అక్షరవనం ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు.గురుపౌర్ణిమ సందర్భంగా అక్షరవనం వ్యవస్థాపకుడు ఎద్మ మాధవ రెడ్డి, అధ్యాపకులను సన్మానించి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కల్వకుర్తి మున్సిపాలిటీ అధ్యక్షుడు గన్నోజు బావిదేవ్ శాలువాతో ఆనంద్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జెట్టి వెంకటేష్కు స్వాగతం పలికారు.కార్యక్రమంలో జాతీయ ఓబీసీ మోర్చా కన్వీనర్ పెరిక సురేష్, రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షులు రఘురామయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సుమన్ గౌడ్, రాష్ట్ర ట్రెజరర్ ఆకారపు సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, 11వ వార్డు కౌన్సిలర్ ఏనుగొండ రామకృష్ణ, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మాయని రాజశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ మెంబర్ గుండోజు గంగాధర్, నాయకులు రమేష్, శ్రీనివాస్, పాండు, కిరణ్తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ కు ఎంపిక పట్ల కలెక్టర్ అభినందనలు



నంద్యాల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):భూటాన్‌లో ఆగస్టు 24 నుంచి 27 వరకు జరగనున్న అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైన క్రీడాకారులు తేజ నాయక్ (ఓర్వకల్ మండలం గుడంబాయి తాండా) మరియు జగదీశ్వరి (గడివేవ ుల మండలం పెసరవాయి గ్రామం)ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో అభినందించారు.కలెక్టర్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం జిల్లాలకు గర్వకారణం. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. భూటాన్‌లో జరిగే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.తేజ నాయక్ చిన్ననాటి నుంచే గోల్ షాట్ బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. అదే విధంగా జగదీశ్వరి కూడా జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతిభ కనబరచి భారత జట్టులో స్థానం సంపాదించడం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఇద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందినవారని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, స్పాన్సర్లు ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. "సమాజం నుంచి లభించే ప్రోత్సాహం మరింత మంది గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు దోహదపడుతుంది" అని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగన్‌కు కాంగ్రెస్ అండ

**- పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ నేతలు**



ఆమనగల్లు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తెల్గమల్ల జగన్ అనారోగ్యంతో హైదరాబాద్ హస్తినాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన జగన్‌కు శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే స్పందించి ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులను ఆస్పత్రికి పంపించి జగన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సూచన మేరకు నాయకులు ఆస్పత్రికి చేరుకుని జగన్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. జగన్ త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి కల్లు వెంకటరమణారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, సర్పంచులు ప్రశాంతి రవికుమార్, పాలకుర్ల మహేందర్, ఆమనగల్లు వ ుండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కా ంగ్రెస్ అధ్యక్షుడు శివలింగం, ఆదివాసీ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ నాయక్‌తో పాటు వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి రైతుల సుభిక్షం కోసం యాగ సంకల్పం ఎమ్మెల్యే కసిరెడ్డి



కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి ప్రాంత రైతులు, పాడి రైతులతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో శ్రీకృష్ణ కాలచక్ర మహా యజ్ఞానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.బుధవారం కల్వకుర్తి పట్టణంలోని విశ్వశాంతి మహాయాగంలో ఎమ్మెల్యే దంపతులు సతీసమేతంగా యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీతో పాటు రుత్వికుల నుండి ఆశీర్వాదం పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాగ కమిటీ ముఖ్యులు జూలూరి రమేష్ బాబు, కల్వ మనోహర్, తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ, మదన మురళి, జంగయ్య, అనంత శేఖర్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నెహ్రూ నగర్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



నందికొట్కూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ గ్రామంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో బుధవారం గురు పౌర్ణిమ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సామాజిక సేవకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గురువు బోధించిన ఆదర్శాలను జీవితంలో ఆచరించడమే నిజమైన గురుభక్తి. సాయిబాబా బోధించిన 'శ్రద్ధా--సబూరి' సిద్ధాంతాలు ప్రతి మనిషి జీవితానికి దిక్సూచిగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.ప్రేమ, సేవ, కరుణ, మానవత్వం వంటి విలువలను అలవర్చుకొని సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిట్టల గంగన్న, జంపుల వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, మందాత రవీంద్రగాడు, పాయసం దాత కీర్తిశేషులు గోపాలు కుటుంబ సభ్యులు, గొల్ల మౌలాలి, డెకరేషన్ దాత కట్టుబడి యూత్, అన్నదాతలుగా నెహ్రూనగర్, ముచ్చుమర్రి, కొణిదేల, నాగటూరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.అలాగే పూల దాత సూగూరు నాగార్జున, పెరుగన్నం దాత జంపుల శ్రీనివాసులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సాయిబాబా సేవా సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



**కర్నూలు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎన్సిటిఈ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) ఆధ్వర్యంలో యూనివర్సిటీ ముందు ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు నాగార్జున మాట్లాడుతూ, "నిబంధనలు పాటించని కళాశాలలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. వెంటనే గుర్తింపులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. ధర్నాలో ఐసా నాయకులు సూర్య, సాయితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని శిరిడి సాయి దేవాలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో సుప్రభాత సేవ, నగర సంకీర్తన, సామూహిక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి శిరిడి సాయినాధుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరాచారి, గోపిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలకు ప్రజలు సహకరించాలి ఎస్ఐ కురుమూర్తి



**కల్వకుర్తి, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. గ్రామస్తులందరూ శాంతియుతంగా పాల్గొని గ్రామసభలు విజయవంతంగా జరగడానికి సహకరించాలని ఆయన కోరారు. "గ్రామసభల సందర్భంగా ఎలాంటి వాగ్వా దాలు, గొడవలు, రాజకీయ విభేదాలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దు. అధికారులతో సహకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో మీ అభిప్రాయాలను తెలియజేయాలి" అని సూచిరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారాలు లేదా చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు.

## నందికొట్కూరు లో కలకలం ఒకే ఇంట్లో నలుగురి ఆత్మహత్యాయత్నం

**నందికొట్కూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన ఒకే కుటుంబం నలుగురు అప్పుల బాధ తట్టుకోలేక పాములపాడు మండల పరిధిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గమనించి వెంటనే స్పందించి వారిని కాపాడి, మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత



**సుల్తానాబాద్ -జూలై 29(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత పిలుపునిచ్చారు. అత్యవసర పనులు ఉంటే మాత్రమే ప్రజలు బయటకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ 10వ వార్డులోని గాంధీనగర్, దర్గా నగర్ ప్రాంతాల్లో వర్షంలోనే పర్యటించిన ఆమె, రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లాలని అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తమను సంప్రదించాలని ప్రజలకు సూచించిన ఆమె, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులతో వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టించారు.

ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు సాయిబాబా ఆలయంలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**ఎలిగేడు, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు సుజిత్ కుమార్ ఆచార్యత్వంలో ఉదయం అభిషేకం, అనంతరం పూజాకార్యక్రమాలు, మధ్యాహ్నం హారతి, సాయంత్రం పల్లకిసేవ వంటి ప్రత్యేక పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయినాధుని దర్శించుకున్నారు.

# పార్టీ నియమాలను అనుసరించాలి

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టిడిపిలో చేరిక**





**విజయనగరం, జులై 29** తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు కూడా పార్టీ నియమాలను అనుసరించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. విజయనగరంలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు బుధవారం గజపతినగరం నియోజకవర్గ బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు 50 కుటుంబాల వారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు వలవల బాబ్జి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరు నిబద్ధత పనిచేయాలని, తెలుగుదేశం పార్టీ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. వైసీపీ సీనియర్ నాయకులు కోరాడ సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్ పల్లి సత్యం వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండల రావు గారు, టిడిపి మండల ప్రెసిడెంట్ రాపాక అచ్చం నాయుడు, మాజీ సర్పంచ్ కర్రోతు , టిడిపి గ్రామ ప్రెసిడెంట్ పెన్నింటి తవుడు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు డీపీఆర్‌లకే పరిమితం కాకుండా గ్రౌండింగ్ కావాలి: జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

**- రూ.75 కోట్లతో ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టును జూలై-2027 నాటికి అందుబాటులోకి తీసుకురావాలి**

**- నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో 'విజయవాడ ఉత్సవ్' నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి**

**- ఇబ్రహీంపట్నం పవిత్ర సంఘం వద్ద వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌తో ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టాలి**

**- పర్యాటక అభివృద్ధితో జిల్లా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది**





**విజయవాడ: జూలై 29,2026.**

జిల్లాలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) దశలోనే నిలిచిపోకుండా వేగవంతంగా గ్రౌండింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాకు ఆర్థికంగా, ఉపాధి పరంగా విశేష ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా పర్యాటక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భవానీ ఐలాండ్ వద్ద రూ.75 కోట్ల అంచనా వ్యయంతో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఏఎంసీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పొందాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డెస్టినేషన్ వెడ్డింగ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, 500 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ హాల్ తదితర ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జూలై-2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవానీ ఐలాండ్‌లో అమరావతి బోటింగ్ క్లబ్‌ను పర్యాటకులకు ఆకర్షణీయంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బోటింగ్ కార్యకలాపాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో 75 మంది సామర్థ్యంతో మినీ థియేటర్‌ను పాఠశాల, కళాశాల విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక, అవగాహన చిత్రాల ప్రదర్శనకు వినియోగించాలన్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంఘం వద్ద నదీహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్‌లో ప్రత్యేక ప్లాట్‌ఫాంను నిర్మించాలని ఆదేశించారు. అలాగే భక్తులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయాలని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాకపోకలకు అనుగుణంగా రోడ్డు అభివృద్ధికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్ అండ్ బి అధికారులు తయారు చేయాలని సూచించారు. నదిహారతి సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నందున సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల మధ్య ఆర్టీసీ బస్సులను ఆ రూట్ లో నడపాలని సూచించారు. విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు జల వనరుల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన "విజయవాడ ఉత్సవ్" కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలో పర్యాటక ఆకర్షణగా ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టి తిరిగి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "ప్రసాద్" (పథకం ద్వారా లభించే నిధులను జిల్లాలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి వినియోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొండపల్లి ఖిల్లాను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రెక్కింగ్, ర్యాపెల్లింగ్ వంటి సాహస క్రీడలకు అవసరమైన బేస్ క్యాంపును జూలై 7 నుండి 11 వరకు ఏర్పాటు చేయడంతో పాటు, శాశ్వత టికెటింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి ట్రెక్కింగ్‌కు అవసరమైన సామగ్రిని పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో సమన్వయంతో ముందుకు సాగాలిజిల్లాలో ప్రతిపాదించిన ప్రతి పర్యాటక ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి ద్వారా జిల్లాకు మరింత ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విజయవాడను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వై.వి. ప్రసన్నలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.శిల్ప, జిల్లా అటవీశాఖ అధికారి ఏ.సతీష్, ఏపీటీడీసీ ఈఈ జి.శ్రీనివాసరావు, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం ఏఈఓ ఎన్.రమేష్, ఏఈ రమ, అమరావతి బోటింగ్ ప్రాజెక్ట్ సీఈవో కాకాని తరుణ్, బీఐటీసీ ప్రాజెక్టు ఇంజనీర్ జి.ఉమామహేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా..!

**- రైతుల ఆర్థిక భద్రతకు పథకంలో 100 శాతం నమోదు అవసరం..**

**- ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి**

**- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలపాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్‌టీఆర్ జిల్లా --విజయవాడతేదీ: జులై 29, 2026**

జిల్లాలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, ప్రజారోగ్యం, వరదల నివారణ, రెవెన్యూ సేవలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును తప్పనిసరిగా పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్)పై ప్రతి మండల వ్యవసాయ అధికారి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఎంత విస్తీర్ణంలో పంట మార్పిడి చేపట్టారో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ కనీసం రెండు నుంచి మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ (91549 70454)ను సంప్రదించే విధంగా అన్ని ఎరువుల దుకాణాల వద్ద హెల్ప్‌లైన్ నంబర్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితుల్లో సీడ్ పెల్లెటింగ్‌ను ప్రతి రైతుకు విస్తృతంగా అమలు చేయాలని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే కాకుండా అందరికీ వర్తించే సాంకేతిక విధానమని వివరించారు. సీడ్ పెల్లెటింగ్ వల్ల మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో కూడా త్తనం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. హరిత విస్తీర్ణంపై దృష్టిపెట్టండి: నెట్ జీరో' లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. మొదట సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రారంభించి అనంతరం అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విస్తరించాలని సూచించారు. గ్రామపంచాయతీలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను హరితవనాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకే బృందంలా పనిచేయాలని, అధికారులు తమ శాఖలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో నిలపడానికి కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధత, 22ఏ దరఖాస్తుల పరిష్కారం తదితరాల పైనా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు.

# గురుపౌర్ణమి ముక్తికి మోక్షమార్గం

**– నందికొట్కూరు పరిధిలో వైభవంగా వేడుకలు**

నందికొట్కూరు, జూలై 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా హిందువులు గురుపౌర్ణమి లేదా వ్యాసపౌర్ణమి ఉత్సవాలను ముక్తికి మోక్షమా ర్గంగా భావించి ఘనంగా నిర్వహిస్తార ు.నందికొట్కూరు పరిధిలోని ప్రసిద్ధ శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాలు -- నందికొట్కూరు, సాయిబాబాపేట, బొల్లవరం గ్రామాల్లో గురుపూజ ోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు మాట్లాడుతూ, "నియోజక వర్గంలో పాడిపంటలు వర్ధిల్లి ప్రజలు సుఖశా ంతులతో జీవించాలని, వర్షాలు సకాలంలో పడాలని ప్రత్యేక పూజలు నిర్వహించాం" అని తెలిపారు.భక్తులు సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి చంద్రోదయం వరకు కొనసాగి చారు. చంద్రోదయాన్ని దర్శించిన తర్వాత ఉపవాసం ముగించారు. ఉదయం నుండి సాయి ంబాబా పూజా కార్యక్రమాలు, భజనలు, అభిషేక ాలు నిర్వహించగా, అనంతరం పురవీధుల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

# తిరుపాడులో "డోర్ టు డోర్" ప్రచారం

గడివేముల, జూలై 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు "డోర్ టు డోర్" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని, గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథ కాలు గురించి వివరించారు.ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకుడు, గడివేముల మ ండలం



బీసీసెల్ అధ్యక్షుడు సి. గిరిబాబుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్ నినో దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

**-రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలి.**

**– జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.**

దేవరకొండ జూలై 29.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ):

నల్గొండ జిల్లా, దేవరకొండ డివిజన్, చందంపేట ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మండల స్థాయి అధికా రులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రస ్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేదని,ఆ ర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని జాగ్రత్తగా పర్యవేక్షించాలని,సక్రమ నీటి సరఫరా తోపాటు, ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటల పై అవగాహన



కల్పించాలని, కందులు, కూరగాయలు ,కీర దోస వంటి పంటలు సాగు చేసుకునేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఎట్టి పరిస్థితి లో భూములు పడావుగా ఉంచవద్దని, ఆరుతడి పంటలు వేసుకునేందుకు ఎంత విత్తనం కావ ాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు యూరియా తక్కువ గా వాడేలా చూడాలని మండల వ్యవసాయ అధి కా రిని ఆదేశించారు.ఈ ఈ కార్యక్రమంలో ఆర్డీ వో పద్మప్రియ ,
అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

**తిరుమల జూలై 29 :** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి చాతుర్మాస దీక్ష సంకల్పం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శ్రీ వైష్ణవ సంప్రదాయకర్త శ్రీ రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైంది. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని ప్రాశస్త్యం.కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.ముందుగా శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో కలశ స్థాపన, కలశ పూజ,విష్వక్సేనా రాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.తరువాత సేకరించిన పుట్ట మన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం శ్రీ పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయ్యంగారి మఠం వద్ద నుండి శ్రీ చిన్నజీయంగారు మరియు ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ స్వామి పుష్కరిణి, శ్రీ వరాహస్వామివారిని దర్శించుకు న్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు.శ్రీవారి ఆలయ మహద్వారం చెంత టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఆలయ అధికా రులతో కలిసి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీ జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత శ్రీ పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, శ్రీ చిన్నజీయం గారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరించారు.అనంతరం శ్రీపెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో,బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి,ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం,పేష్కార్ శ్రీ రామ కృష్ణ, నాసన్మానించారు.

# మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**ఆదోని జూలై 29 :** మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు.బుధవారం సాయంత్రం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు వారితో మాట్లాడారు.

# నేడు వేములలో పంచాయతీ అభివృద్ధికి దిశానిర్దేశం

**వేముల జూలై 29 :**వేముల మండలంలోని గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపిడీపీ)పై నేడు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ శారదమ్మ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ కమిషనర్, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆదేశాల మేరకు వేముల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనగా నేడు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ

# జిల్లా ఆర్థికాభివృద్ధికి జివిఏ--జిడిడిపిపై సమగ్ర అవగాహన అవసరం: జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**- స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలకు నాణ్యమైన గణాంకాలే పునాది**

**- మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జివిఏ--జిడిడిపిపై అవగాహన పెంపొందించాలి**

**- శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించాలి**






విజయవాడ: జూలై 29,2026.

జిల్లా ఆర్థికాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థూల విలువ జోడింపు, స్థూల జిల్లా దేశీయోత్పత్తి వంటి ఆర్థిక సూచికలపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణలో జిల్లా ఆర్థికాభివృద్ధి, జివిఏ, జిడిడిపి, రంగాల వారీ ఆర్థిక వృద్ధి, జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక గణాంకాల తయారీ, విశ్లేషణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లైన మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్, యంగ్ ప్రొఫెషనల్స్‌కు సమగ్ర అవగాహన కల్పించారు. 2025--26 సంవత్సరానికి జిల్లా జిడిడిపి సుమారు రూ.1,05,135 కోట్లుగా నమోదైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధి ప్రగతిని అంచనా వేయడంలో జివిఏ, జిడిడిపి వంటి ఆర్థిక సూచికలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖ జివిఏ లెక్కింపు విధానాలు, రంగాల వారీ వృద్ధి, గణాంకాల వినియోగంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే నూరు శాతం అక్షరాస్యత సాధించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తే దాదాపు 95 శాతం ప్రజలను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు సంపూర్ణ నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే కుటుంబాలతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తారని తెలిపారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలతో పాటు విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వరి సాగులోని కొంత భూమిని ఉద్యానవన పంటలకు మళ్లించడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సేవారంగంలో సుమారు రూ.150 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధితో సేవారంగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సహజ, మానవ వనరులు, భౌగోళిక అనుకూలతలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో ఉత్పత్తి పెంపుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని, సేవా, పారిశ్రామిక రంగాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం సైద్ధాంతిక అంశాలకు పరిమితం చేయకుండా పరస్పర చర్చలు, ప్రశ్నోత్తరాలు, ఆచరణాత్మక ఉదాహరణలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయి అధికారులు, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు సిబ్బందికి సమర్థవంతంగా చేరవేయాలని ఆదేశించారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి జివిఏ, జీఎన్‌డీపీ, జిడిడిపి, జీఎస్‌డీపీ వంటి ఆర్థిక భావనలపై క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పించాలని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల అమలులో భాగస్వాములైన ప్రతి స్థాయి అధికారి, సిబ్బందికి ఈ అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండటం అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి సంబంధించిన గణాంకాల సేకరణ, విశ్లేషణ, వినియోగంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేసి స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక ఉ గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.అనుపమ మాట్లాడుతూ, ప్రతి శాఖ తన పరిధిలోని గణాంక సమాచారాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకతతో, నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 లక్ష్యాల సాధనలో నాణ్యమైన, విశ్వసనీయ, సమయానుకూల గణాంకాలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలలో రంగాల వారీ జివిఏ పురోగతిని కీలక పనితీరు సూచికల ద్వారా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చోట సకాలంలో చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పహాలే ఇండియా ఫౌండేషన్ శిక్షకులు జె.అనిల్ కుమార్, బెల్లపు రాగిణి, జోనల్ కోఆర్డినేటర్ యోగేష్ కృష్ణ, జిల్లా విశ్లేషకులు, మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**కర్నూలు జూలై 29 :**ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర ఏ 2047 లో భాగంగా వివిధ శాఖల స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జి.డి.డి.పి)పై సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు అమలు చేయనున్న కార్యాచరణ ప్రణాళిక (ఆక్షన్ ప్లాన్) పై జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టర్ బి.గోపాల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం యొక్క స్థానిక వనరులు, ప్రత్యేకతలు మరియు అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.వీటితో పాటు స్వల్పకాలిక ప్రయోజనకరమైన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తక్కువ నీటితో వరి సాగు చేసే ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, వాటిని విస్తృతంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.



జిల్లాలో నీటి కొరత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వరి సాగు కంటే ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు.

ముఖ్యంగా ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తదితర ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మామిడి, జామ, దానిమ్మ, సపోటా వంటి అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.. పశువుల పెంపకానికి సంబంధించిన రుణాలను త్వరితగతిన ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి డివిజన్‌లో స్థానిక వనరులు, వ్యవసాయ అవకాశాలు, ప్రత్యేకతలను గుర్తించి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. విండ్ పవర్, సోలార్ పవర్ రంగాల్లో ఉన్న అవకాశాలను మరింత విస్తరించేందుకు కొత్త కంపెనీలను ఆకర్షించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ తన పరిధిలోని అభివృద్ధి పనులపై స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసి ప్రతిపాదనలు అందించాలని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శాఖలతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేయించాలన్నారు. పత్తి సాగు చేస్తున్న ప్రతి రైతు క్లస్టర్ బీన్ (గోరుచిక్కుడు), కంది, జొన్న, సజ్జ, బెండ వంటి పంటల్లో కనీసం రెండు పంటలను అంతర పంటలుగా సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి 5 కోర్సు లను గుర్తించి వాటిని కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటనపై సీపీఎం బహిరంగ లేఖ

**● సోలార్ భూ లీజు గడువు తగ్గించాలి.. ● సాగునీరు రహదారుల సమస్యలు పరిష్కరించాలి**

**పత్తికొండ జూలై 29 :**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పత్తికొండ పర్యటన సందర్భంగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ లేఖ విడుదల చేశారు. పత్తికొండ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హోసూరు గ్రామంలో టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూముల లీజు ఒప్పందాన్ని 30 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలకు తగ్గించాలని, రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే హంద్రీ కాలువకు హోసూరు సమీపంలో స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని కోరారు. హంద్రీనీవా కాలువల నుంచి పెద్దహుల్తి, చిన్నహుల్తి, జూటూరు, దూదేకొండ, కోతిరాళ్ల గ్రామాలకు పంట కాలువల ద్వారా సాగునీరు, తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.టమోటా రైతుల ప్రయోజనాల కోసం నిర్మాణంలో ఉన్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లను విస్తరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే పత్తికొండ ప్రాంతం నిత్యం కరువుకు నిలయంగా ఉందని, ఇలాంటి ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి పర్యటనలు జరుగుతున్నప్పటికీ పత్తికొండ అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై స్పష్టమైన హామీలు రావడం లేదని విమర్శించారు.హోసూరు గ్రామంలో దాదాపు 1800 ఎకరాల్లో నిర్మిస్తున్న టాటా పవర్ సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరవుతున్న నేపథ్యంలో, ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తున్నామని, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు రంగారెడ్డి, వెంకటేశులు, గోపాల్, రామాంజనేయులు, సురేంద్ర, సిద్ధాగౌడ్, ప్రజాసంఘాల నాయకులు ఎం. రవిచంద్ర, ఉశేని, దుర్గా తదితరులు పాల్గొన్నారు.